సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 10 । జూన్ । 2025



స్వామి పుష్కరిణిలో డెవిల్ ఫిష్


గండేపల్లి మండలం తాళ్లూరులోని వేంకటేశ్వర స్వామి వారి గజేంద్ర మోక్ష పుష్కరిణిలో సాధారణ చేపలతో పాటు డెవిల్ ఫిష్‌లు పెరిగాయి. - 8లో▸



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు శ్రీపాద లక్ష్మీనర సింహమూర్తి దంపతులు (రాజమహేంద్రవరం) రూ.50,558 విరాళం అందజేశారు.

డెల్టాలకు 2,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 700, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 2 వేలు కలిపి మొత్తం 2,800 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 22,099 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు.

‘సాక్షి’పై దాడులు ఆపాలి



‘సాక్షి’పై దాడులను నిరసిస్తూ రాజానగరంలోని పత్రిక యూనిట్ కార్యాలయం వద్ద సిబ్బంది సోమవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని, పత్రికా కార్యాలయాలపై దాడులు వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బ్రాంచి మేనేజర్, రీజినల్ మేనేజర్ రమేష్‌రెడ్డి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. కాగా, సాక్షిపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు మండలాల్లో పాత్రికేయులు పోలీసు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. – రాజానగరం

‘సాక్షి’ కార్యాలయాలపై దాడులు తగవు : స్వాతి ప్రసాద్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాక్షి కార్యాలయాలపై అధికార పార్టీ కార్యకర్తలు దాడులు చేయడాన్ని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సభ్యుడు కె.స్వాతిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి బోర్డులపై సాక్షి అక్షరాలను తొలగించడం, పత్రిక ప్రతులను దహనం చేయడం వంటి చర్యలకు పాల్పడటం దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. ఈ నెల 6న ‘సాక్షి’ టీవీలో ప్రసారమైన లైవ్ షోలో అమరావతి మహిళలను కించపరుస్తూ ఒక పాత్రికేయుడు చేసిన వ్యాఖ్యలు దారుణమని, దీనిపై పలుచోట్ల పౌరులు ఫిర్యాదులు చేయగా కేసులు నమోదయ్యాయని, వాటిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపై దాడులకు పూనుకోవడం గర్హనీయమన్నారు. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. అధికార పార్టీ నేతలు వెంటనే తమ కార్యకర్తలను అదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే లైవ్ షో నిర్వాహకుడు, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు తన షోలో జరిగిన సంఘటనకు క్షమాపణ చెప్పినందున, ఆయన సీనియార్టీ, వయస్సును దృష్టిలో ఉంచుకుని ఆయనపై తదుపరి చర్యలు నిలిపివేయాలని స్వాతిప్రసాద్ కోరారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



షైనింగ్ స్టార్ అవార్డులు అందజేస్తున్న మంత్రి రామానాయుడు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 169 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేశారు. స్థానిక త్యాగరాజ నారాయణ సేవా దాస సమితి హాలులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు ఈ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నామని చెప్పారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలుస్తారని అన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ ఈ విజయపరంపరను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఉన్నత స్థానాలకు చేరుకున్న తరువాత పుట్టిన ఊరిని, తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలని, వారి అభ్యున్నతికి పాటు పడాలని కోరారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఆర్డీఓలు ఆర్.కృష్ణానాయక్, ఆర్.సుస్మిత, పాఠశాల విద్య ఆర్జేడీ జి.నాగమణి, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు పోలవరం ఎడమ కాలువ పనులు

ధవళేశ్వరం: పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రభుత్వ ఇరిగేషన్ ప్రాజెక్టుల సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తితో కలిసి ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై ధవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్దేశిత లక్ష్యాల సాధనలో వెనుకబడిన ఇంజినీరింగ్ అధికారుల నుంచి వివరణ కోరాలని ఆదేశించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కార్యాలయంలో వచ్చే వారంలో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం(పీజీఆర్ఎస్)కు 24 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్పీ డి.నరసింహ కిషోర్ అర్జీలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీటు నిరాకరించే పాఠశాలలపై చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు నిరాకరించే పాఠశాలలపై చర్యలు తప్పవని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు హెచ్చరించారు. ఎంఈఓలతో సోమవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత అడ్మిషన్ల ప్రక్రియను మంగళవారం సాయంత్రం లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను గత నెల 29న ప్రకటించినప్పటికీ ఇంకా కొన్నిచోట్ల ప్రవేశాలు పూర్తి కాలేదన్నారు. అడ్మిషన్లు నిరాకరించే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అడ్మిషన్ పొందిన విద్యార్థుల వివరాలను తగు ధ్రువీకరణతో తమ కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఒకవేళ తల్లిదండ్రులు నిరాసక్తత చూపితే వారి నుంచి రాతపూర్వకంగా తీసుకోవాలని సూచించారు.



విక్రయానికి ధాన్యాన్ని సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)



పెరవలి మండలం అన్నవరప్పాడులో నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు (ఫైల్)

ఏదీ.. వ్యవసాయం!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- కూటమి పాలనలో వ్యవసాయ రంగం తిరోగమనం
- రబీ ధాన్యం సొమ్ము చెల్లింపులో నిర్లక్ష్యం
- అందని ‘అన్నదాత సుఖీభవ’
- గత ప్రభుత్వంలో సాగుకు భరోసా
- అడగడుగునా రైతుకు తోడ్పాటు
- క్రమం తప్పకుండా రైతు భరోసా
- పంట నష్టపోయిన మూడు నెలల్లో పరిహారం

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం తిరోగమనంలో పయనిస్తోంది. సాగుకు సిద్ధమైన సమయంలో పెట్టుబడులకు ‘అన్నదాత సుఖీభవ’ ఆర్థిక సాయం అందడం లేదు. పంట నష్టపోతే పరిహారం సైతం అందే పరిస్థితి లేదు. బీమా ప్రీమియం చెల్లింపునకు మంగళం పాడారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు పంట విక్రయాల వరకూ రైతులకు అడుగడుగునా అండగా నిలిచిన రైతుభరోసా కేంద్రాలను (ఆర్‌బీకే) నిర్వీర్యం చేశారు. ఆరుగాలం స్వేదం చిందించి, పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయిస్తే.. సకాలంలో సొమ్ము ఇవ్వకుండా రైతులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. పొగాకుకు మద్దతు ధర లేదు. ఉద్యాన, ఆక్వా పంటలకు సైతం ప్రోత్సాహం కరువైంది. వెరసి అన్నదాతకు ఆర్తనాదాలు తప్పడం లేదు.

గతమెంతో ఘనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి పెద్ద పీట వేశారు. రైతులను ఆదుకునేందుకు, పెట్టుబడులకు అప్పులు చేయకుండా ఉండేందుకు ‘రైతు భరోసా’ పేరిట ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. ఈవిధంగా నాలుగేళ్లలో 1,33,502 మంది రైతులకు రూ.584.64 కోట్లు అందజేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో అండగా నిలిచారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులోకి తెచ్చారు. ఆక్వా రైతులకు విద్యుత్‌లో రాయితీ సైతం అమలు చేశారు. వెరసి వ్యవసాయ రంగం సస్యశ్యామలంగా విరాజిల్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20,000 అందిస్తామని గొప్పగా ప్రకటించి, తొలి ఏడాది ఎగ్గొట్టారు. దీనిని ఈ ఏడాదైనా అమలు చేస్తారా అనే మీమాంస నెలకొంది. ఈ పథకం కోసం 1.35 లక్షల మంది రైతులు నిరీక్షిస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు కోతలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలల వ్యవధిలోనే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు నాంది పడింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ప్రకటనలు గుప్పించిన సర్కారు.. కొన్ని రోజులకే దీనిని 8 గంటలకు తగ్గించింది. తరువాత మరో గంట కుదించింది. విద్యుత్ అధికారుల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా.. ఎలాంటి ప్రకటనా చేయకుండా అనధికారిక కోతలు అమలు చేస్తోంది. తద్వారా వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తామన్న సంకేతాన్ని రైతులకు ఇస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతాలైన దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, నల్లజర్లలో కొంత భాగం, నిడదవోలు రూరల్, పెరవలి మండలంలో కొన్ని గ్రామాలు, గోకవరం, రాజానగరం, అనపర్తి మండలాల్లో ఎక్కువ శాతం రైతులు ఉద్యాన పంటలకు బోర్లపై ఆధారపడుతారు. వీరందరికీ ఇబ్బందులు తప్పడం లేదు.

ధాన్యం.. దయనీయం..

ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం నెల రోజులు గడుస్తున్నా ఆ డబ్బులు ఇవ్వడం లేదు. గత నెల 24వ తేదీ నాటికి 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. దీనికి గాను రూ.781.08 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రూ.632.6 కోట్లు ఇచ్చారు. మిగిలిన రూ.148.48 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారో తెలియకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉచిత పంటల బీమా హుళక్కి

ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బ తిన్న రైతులకు ఎటువంటి నష్టమూ వాటిల్లకుండా పరిహారం అందించడంలో ఉచిత పంటల బీమా కీలక భూమిక పోషించేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలని నిబంధన పెట్టింది. 2024–25 రబీ సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన పంటలకు బీమా ప్రీమియం చెల్లింపునకు ఉత్తర్వులు వెలువరించింది. వరికి హెక్టారుకు రూ.1.05 లక్షలుగా విలువ నిర్ధారించి రైతు వాటాగా 1.50 శాతం అంటే రూ.1,575 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు వాటాను సైతం ప్రభుత్వమే భరించేది.

పంటల వారీగా హెక్టారుకు మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ

పంట	ఇన్‌పుట్ సబ్సిడీ
వరి, వేరుశనగ, పత్తి, చెరకు	రూ.17,000
మొక్కజొన్న	రూ.12,500
మినుములు, పెసలు, శనగలు, పొద్దుతిరుగుడు, పొగాకు	రూ.10,000
జొన్న	8,500

జిల్లాలో ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు ఇలా..

నియోజకవర్గం	రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.లక్షల్లో)
అనపర్తి	682	344.28	52.43235
రాజమండ్రి రూరల్	214	112.55	18.8077
రాజానగరం	8,554	6032.16	838.6905
జగ్గంపేట (గోకవరం)	1,484	832.05	141.4485
గోపాలపురం	2,970	2195.81	279.91535
కొవ్వూరు	819	534.9	77.28165
నిడదవోలు	892	435.27	71.9426

నాడు రైతులకు పెద్ద పీట

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయం, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన కర్షకుల కన్నీళ్లు తుడిచింది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బ తిన్న పంటల లెక్క వేగంగా తేల్చింది. నెలల వ్యవధిలోనే పంటలకు పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 15,615 మంది రైతులకు సంబంధించి 10,487.02 హెక్టార్లలో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బ తిన్నట్లు నాడు వ్యవసాయ అధికారులు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ప్రభుత్వం ఇంకో ఆలోచన చేయకుండా రైతులకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు రూ.14.80 కోట్ల పెట్టుబడి రాయితీ మంజూరు చేసింది.
- వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద గత ప్రభుత్వం రైతులకు అత్యాధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో 367 ఆర్‌బీకేలు ఉండగా.. తొలి దశలో ప్రతి మండలంలో మూడు చొప్పున ఆర్‌బీకేలకు డ్రోన్లు మంజూరు చేసింది. జిల్లాకు మొత్తం 91 డ్రోన్లు అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయ పనులకు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది.
- ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా నివారించింది. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు – కొలతలు, ఇతర శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేపట్టింది. రవాణా చార్జీల చెల్లింపులో జాగ్రత్తలు తీసుకున్నారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేశారు.

ఇసుకాసురులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్ర సంగమ ప్రాంతం వరకూ..
- చెలరేగిపోతున్న అక్రమార్కులు
- ఏడాదిలో రూ.100 కోట్లకు పైగా ఇసుక దందా
- గోదావరి ఇసుక, తువ్వ, సముద్ర తీరంలో బొండు ఇసుక, చేలల్లో మట్టి తవ్వకాలు
- దేనినీ వదలని కూటమి నాయకులు
- జిల్లాలో 20 అధికార ర్యాంపుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు



రావులపాలెం స్టాక్ పాయింట్-1: గత ప్రభుత్వం స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉంచిన ఇసుకను గత ఏడాది ఆగస్టు నాటికే ఊడ్చేశారు

సాక్షి, అమలాపురం: రాష్ట్రంలో గత ఏడాది ప్రభుత్వం మారినప్పటి నుంచి నేటి వరకూ ఇసుకాసురులు చెలరేగిపోతూనే ఉన్నారు. ర్యాంపుల్లో నిబంధనలకు విరుద్ధంగా దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటున్నా అడ్డగోలు దోపిడీ చేస్తున్నారు. ఇక అనధికార ర్యాంపుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ‘నదీపాయల్లో బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తెచ్చుకోవచ్చు’ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనను టీడీపీ, జనసేన నేతలు వరంగా మార్చుకున్నారు. బాబు చెప్పిన దాని ప్రకారం జిల్లా ఇసుక కమిటీ ఎంపిక చేసిన ర్యాంపుల నుంచి మాత్రమే ఇసుక తవ్వాల్సి ఉంది. కానీ, ఇదే అదనుగా కూటమి పార్టీలకు చెందిన చోటామోటా నాయకులు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్ర సంగమ ప్రాంతం వరకు గోదావరి నదీపాయలను దొలిచేస్తున్నారు.

ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే..

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు గత ఏడాది జూన్ 4న వెలువడ్డాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖరారైంది. ఆ రోజు సాయంత్రం నుంచే ఇసుక అక్రమార్కులు దందాకు తెర తీశారు. అంతకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరదలు, భారీ వర్షాల సమయంలో ఇసుకకు కొరత రాకుండా ఆరు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి భారీగా ఇసుక నిల్వ ఉంచింది. మొత్తం 2,44,131 మెట్రిక్ టన్నుల ఇసుకను ఆగస్టు మొదటి వారానికల్లా ఇసుకాసురులు ఊడ్చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సైతం ఇసుక లేకుండా చేశారు. ప్రభుత్వం ఉచితం పేరుతో టన్నుకు రూ.265 చొప్పున వసూలు చేసిన విషయం తెలిసిందే. స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా లారీకి అదనంగా రూ.5 వేల చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకున్నారు. నియోజకవర్గ కీలక నేతలు బి-ట్యాక్స్, వి-ట్యాక్స్ పేరుతో కోట్లు కొల్లగొట్టారని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి.

సీఆర్‌జెడ్ పరిధిలో..

కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో సైతం అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. రావులపాలెం మండలం గోపాలపురం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నప్పటికీ ఇసుక తవ్వేశారు. అది కూడా గోపాలపురం – సిద్ధాంతం మధ్య ఉన్న రెండు వంతెనలకు 300 మీటర్ల సమీపంలోనే ఇసుక తవ్వేయడం గమనార్హం. పి.గన్నవరంలో సైతం సీఆర్‌జెడ్ నిబంధనలను తోసిరాజని తవ్వేశారు. అయినవిల్లి మండలం కొండుకుదురు పరిసర ప్రాంతాలు, ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, కొమరగిరి, పాత ఇంజరం, గుత్తెనదీవి, జి.వేమవరం, ముమ్మిడివరం మండలం గేదెల్లంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పిల్లంక, గోవలంకలలోను సీఆర్‌జెడ్ పరిధిలో ఇసుక తవ్వేశారు.

పి.గన్నవరంలో ‘జట్టు కట్టారు’

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో కూటమి నేతలు ఎన్నికల్లోనే కాకుండా ఇసుక అక్రమ తవ్వకాల్లో సైతం జట్టు కట్టారు. మామిడికుదురు మండలం బి.దొడ్డవరం, ఆదుర్రులో ఇసుక తవ్వకాలు సాగించారు. అయినవిల్లి మండలం కొండుకుదురు లంకలో రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెంలో తువ్వ ఇసుక అనుమతులు తెచ్చుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో అనుమతులివ్వగా దీనిని అడ్డం పెట్టుకుని అక్రమ తవ్వకాలు జోరుగా చేస్తున్నారు. పెదకందాలపాలెం, ఊడిమూడి, మానేపల్లిలో సైతం ఇష్టానుసారం తవ్వకాలు చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేత కనుసన్నల్లో ఈ దందా సాగుతోంది.

చీకటి పడితే చెలరేగిపోవడమే..

ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో చీకటి పడితే చాలు. తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. ఐ.పోలవరం మండలంలో మరీ బరితెగించారు. ఎదుర్లంక పాత రేవులో ఇసుక తవ్వకాలు జోరుగా సాగాయి. ఇదే మండలం గుత్తెనదీవి, ముమ్మిడివరం మండలం గేదెల్లంక, కాట్రేనికోన మండలం నడవపల్లి సమీపంలోని పత్తిగొంది వద్ద వృద్ధ గౌతమీ పాయలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వేశారు.

సొంతంగా డ్రెడ్జింగ్



పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక వద్ద వశిష్ట నదీపాయలో డ్రెడ్జింగ్ (ఫైల్)

గోదావరి నదీపాయల్లో పడవల మీద డ్రెడ్జర్లు ఏర్పాటు చేసి మరీ ఇసుక తోడేశారు. పి.గన్నవరం మండలం ఊడిమూడిలంకలో అనధికార ఇసుక ర్యాంపు ఏర్పాటు చేసి ఇసుకతో పాటు మట్టి తవ్వకాల కోసం ఏకంగా డ్రెడ్జింగ్ చేశారు. ఇది లంక గ్రామాలకు పెనుముప్పు. అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నిలిపివేశారు.


యోగాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా రాజమహేంద్రవరం వై జంక్షన్ నుంచి దేవీచౌక్ వరకూ, తిరిగి వై జంక్షన్ వరకూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ, సుమారు 2,100 మందితో ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రేపు బస్ పాస్‌లు



రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోకవరం, నిడదవోలు ఆర్టీసీ డిపోల్లో బుధవారం ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ విద్యార్థులకు బస్ పాస్‌లు ఇవ్వనున్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి వై.సత్యనారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 159 అర్జీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 159 అర్జీలు సమర్పించారు. వారి నుంచి డీఆర్ఓ సీతారామమూర్తి, డీఎల్‌డీఓలు పి.వీణాదేవి తదితరులు అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్ఓ ఈ సందర్భంగా చెప్పారు.

క్లుప్తంగా

కరవాక తీరానికి వింత జీవులు



కరవాక తీరంలో సముద్ర జంతువుల అడుగు జాడలు

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం, కరవాక సముద్ర తీరానికి వింత జీవులు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. జనసంచారం లేని సమయంలో, రాత్రివేళల్లో సముద్రం నుంచి భారీ జంతువులు తీరానికి వచ్చి సేద తీరి వెళ్తున్నట్లు చెబుతున్నారు. ఆ జీవులు ఏంటనేది తెలియడం లేదు. అయితే జంతువుల అడుగులు ఇక్కడ స్పష్టంగా కనిపించడం గమనార్హం. సుమారు రెండు నుంచి నాలుగు పెద్ద సముద్ర జంతువులు ఇలా తీరానికి వస్తున్నట్లు ఇక్కడి రైతులు చెబుతున్నారు. ఇక్కడ సముద్రం లోతు అధికంగా ఉండడం వల్ల భారీ సముద్ర జీవులు ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రగతిలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీసీ ప్రసాద్, చైర్మన్ కృష్ణారావు, డీపీపీ బాలకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ, వాద్వాని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైనీ ట్రైనర్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ అండ్ వెంచర్ క్రియేషన్ అంశంపై ఐదు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి స్వయం ఉపాధికి సంబంధించిన కార్యక్రమాలు వికసిత్ భారత్ 2047-స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయడానికి దోహదపడతాయన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ శిక్షణకు తమ కళాశాలను ఎంచుకోవడం సంతోషంగా ఉందని, వాద్వాని ఫౌండేషన్ డైరెక్టర్, పార్టనర్ షిప్ దయాకర మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్‌టీయూకే అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.బాలకృష్ణ, డైరెక్టర్ మేనేజ్‌మెంట్ హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జి.నరేష్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.ఆనంద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలి

- నారుమడుల సంరక్షణతో నాణ్యమైన దిగుబడులు
- రైతులు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి
- వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే మేలు

పాడి-పంట



పెనికేరులో ఖరీఫ్ పంటకు సంబంధించి నారుమడి కోసం దమ్ము చేస్తున్న రైతు



పెదపళ్లలో సిద్ధం చేసుకున్న నారుమడి

ఆలమూరు: ఖరీఫ్ పంటకు సంబంధించి నారుమళ్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఖరీఫ్‌లో అధిక శాతం వెదజల్లు సాగు చేపడుతుండగా మిగతా భూమిలో నారుమళ్ల ద్వారా సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.63 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంకా అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా పెట్టుబడి సాయం అందకపోవడంతో ఖరీఫ్ మరింత జాప్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులను సాధించడంతో పాటు త్వరితగతిన కోతకు వచ్చే వరి వంగడాలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో భాగంగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడంతో పాటు త్వరితగతిన కోతకు వచ్చే అవకాశం ఉండటంతో వ్యవసాయశాఖ ఈ ఖరీఫ్‌లో స్వర్ణ (7029), ఎంటీయూ (1318), ఎంటీయూ (1121) రకాలు వినియోగించాలని సూచనలిస్తోంది. అయితే రైతుల మాత్రం ఏళ్ల తరబడి సంప్రదాయబద్ధంగా వస్తున్న స్వర్ణ (7029) రకానికి మాత్రమే ప్రాధ్యాన్యం ఇస్తున్నారు. నారుమళ్ల దశలో సరియైన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలు, నష్ట నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా చీడపీడలను నివారించడంతో పాటు నాణ్యమైన పంటలను పండించవచ్చునని వ్యవసాయశాఖ చెబుతోంది.

సస్యరక్షణ చర్యలు



కె.నాగేశ్వరరావు

నారుమడుల తయారీలో కనీస యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలను పాటిస్తే పెట్టుబడి ఆదా అవడంతో పాటు నాణ్యమైన పంటలను పండించవచ్చునని ఆలమూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు చెబుతున్నారు.

- తొలుత 80 శాతం మొలక కలిగిన నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేయాలి. నారుమడులను ఏర్పాటు చేసుకునేందుకు 10-12 రోజుల మధ్య దమ్ము చేసి నేలను చదును చేసుకోవాలి.
- పొలాల్లో నీరు పారేందుకు చిన్న చిన్న కాలువలను ఏర్పాటు చేసుకుని ప్రతి మొక్కకు నీరు అందేలా చూడాలి.
- ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పోటాష్‌నిచ్చే ఎరువులను మిశ్రమం చేసి దుక్కులో వేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగ ఉండే ప్రదేశంలో భాస్వరాన్ని రెట్టింపు చేయాలి.
- వరి నారు ఆకుగా విచ్చుకునే వరకూ ఆరుతడులుగా నీటిని అందించాలి. ఆకు కొద్దిగా ఎదిగి ఒక దశకు వచ్చిన తరువాత నీటిని నిల్వకట్టాలి.
- జింక్‌లోపం గమనిస్తే లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.
- చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దాళ్వా వరి సాగుకు కనిపించే జింక్ లోప లక్షణాలను గుర్తిస్తే సత్వరమే వ్యవసాయశాఖ సూచనలు తీసుకోవాలి.
- నారు తీయడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే ఐదు సెంట్లలో వేసిన నారుమడికి ఒక కేజీ కిర్బోఫ్యూరాన్ గుళికలను తక్కువ నీటిలో సమానంగా చల్లాలి.

నాట్లు వేసే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు

- వరి నారుమడి వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి.
- నారు వేయడానికి పక్షం రోజుల ముందు పొలాన్ని మురుగు దమ్ము చేయాలి.
- 15 సెంటీమీటర్లకు మించి లోతుగా దమ్ము చేయరాదు.
- పొలాన్ని దమ్ము చెక్కతో కాని యంత్ర పరికరంతో గాని చదును చేయాలి.
- నారుమడి లేత ఆకు రంగులో ఉన్నప్పుడే నాటడం ద్వారా త్వరగా మూన కడుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించుకుంటే ఫలితం ఉంటుంది.
- నారు పైపైన ఉండే విధంగా నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది.
- నారు వేసేటపుడు భూసారాన్ని బట్టి చదరపు మీటరుకు 33 మూనలు ఉండేటా నాటాలి.
- వరి నాట్లు నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటిమీటర్ల చొప్పున బాటలు వేయాలి.
- దీనివల్ల పైరుకు వెలుతురు తగిలి చీడపీడలు నివారణకు దోహదపడుతుంది.
- నారుమడి మునిగితే తీసుకోవలసిన జాగ్రత్తలు
- నారుమడిలో బాటలు వేసి నీటిని తొలగించాలి.
- తిమొక్కలు కోలుకోవడానికి ఎకరా నారుమడికి యూరియా, పొటాష్ ఎరువులను 10 కేజీల చొప్పున అందించాలి.
- నారుమడికి తెగుళ్లు సోకకుండా లీటరు నీటిలో రెండు గ్రాముల కార్బన్‌డిజమ్, 2.5 మి.గ్రా క్లోరో పైరిఫాస్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్న రైతులు ప్రత్యామ్నాయంగా వెదజల్లు విధానాన్ని అవలంబించి సమయం, పెట్టుబడిని ఆదా చేసుకోవాలి.

వ్యవసాయశాఖ సూచనలు, సలహాలను తీసుకుంటే నారుమడి దెబ్బతిన్న రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

జూన్ ద్వితీయార్థంలో నారుమళ్లు చేపట్టాలి

2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ ద్వితీయార్థంలో నారుమళ్ల ప్రక్రియను చేపట్టి జూలై 15 నాటికి వరినాట్లు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ చెబుతోంది. దీనివల్ల అక్టోబర్ నెలాఖరు నాటికి వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంటుందని భావిస్తుంది. దీనివల్ల ఏటా నవంబర్ నెలలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను నుంచి తప్పించుకోవచ్చునని, మళ్లీ డిసెంబర్ చివరి నాటికి రబీ సాగుకు సంబంధించి వరినాట్లు పూర్తి చేస్తే వచ్చే ఏడాది మార్చి నాటికి రబీ పంట చేతికొస్తుందని, దీనివల్ల మూడవ పంటగా అపరాల సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ సూచనలు కచ్చితంగా పాటిస్తూ భూసారం పెరిగి ప్రతి ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాలు అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏపీ ఈఏపీ సెట్ 2025
ఫలితాలలో శశి జయభేరి



వేలివెన్ను శశి క్యాంపస్‌లో ర్యాంకర్లతో శశి సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: ఏపీ ఈఏపీ సెట్-2025లో శశి వేలివెన్నుకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అత్యుత్తమ ర్యాంకులతో మరోసారి తమ సత్తా చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ సోమవారం తెలిపారు. ఆర్ హర్షవర్ధన్ స్టేట్ 1వ ర్యాంకు, వై.సత్య వెంకట్ 5వ ర్యాంకు, ఎస్.శశి గోవర్ధన్ 6వ ర్యాంకు, కె.మోహిత్ శ్రీరామ్ 9వ ర్యాంకు, ఎస్.సాయి శ్రీనివాసు 17వ ర్యాంకు, కె.భానుప్రకాష్ 20వ ర్యాంకు, డి.రత్న కుమార్ 37వ ర్యాంకు, డి.శ్యామ్ కృష్ణారెడ్డి 57వ ర్యాంకు, ఎ.లక్ష్మి శరణ్య 80వ ర్యాంకు, వై.చరణ్ 84వ ర్యాంకు సాధించారన్నారు. 100 లోపు ర్యాంకులు 10 మంది, 500లోపు ర్యాంకులు 26 మంది, 1,000లోపు ర్యాంకులు 46 మంది, 2,000లోపు ర్యాంకులు 97 మంది, 5,000లోపు ర్యాంకులు 265 మంది, 10,000లోపు ర్యాంకులు 450 మంది సాధించారని ఆయన తెలిపారు. ఈ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

మట్టి ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



రాజేష్

బిక్కవోలు: పందలపాకలో మట్టి ట్రాక్టర్ బోల్తా పడి ఒక్క వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం పందలపాక శివారుల్లో పంట పొలాలు మేరక తీస్తూ ఉన్న ట్రాక్టర్ దిగబడి పోవడంతో దాని బయటి లాగే క్రమంలోని ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న రాయవరం మండలం రాయవరంకి చెందిన వేమగిరి రాజేష్ (31) మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ఈ ప్రదేశం రెండు జిల్లాల మధ్య ప్రాంతం కావడంతో రెండు ప్రాంతాలు నుంచి పోలీసులు అక్కడి చేరుకున్నారు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ మాట్లాడుత ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే మృతదేహానికి పంచనామా నిర్వహిస్తామన్నారు.

స్వామి పుష్కరిణిలో డెవిల్ ఫిష్!



పుష్కరిణిలో వలకు చిక్కిన డెవిల్ ఫిష్



పుష్కరిణిలో చేపలు పడుతున్న దృశ్యం



పుష్కరిణిలో నీటిని తోడుతున్న ఇంజిన్లు. చిత్రంలో శిథిలమైన మెట్లు

- యథేచ్ఛగా చేపల వేట
- అసలు అవి ఎలా వచ్చాయి?
- ఇద్దరి మృతితో ఎట్టకేలకు నీటికి మోక్షం

గండేపల్లి: తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి గజేంద్ర మోక్ష పుష్కరిణిలో కొందరు ఆకతాయిలు సోమవారం చేపలను వల సహాయంతో పట్టుకుని తీసుకుపోయినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఈ పుష్కరిణిలో పెరిగిన చేపలను పట్టుకోవడం శాస్త్ర సమ్మతం కాదని పండితులు పేర్కొంటున్నారు. ఆలయాలలో ఉండే కోనేరులలో పెరిగిన చేపలను విష్ణుమూర్తి మత్స్యావతారంగా భక్తులు భావిస్తారు. అంతటి పవిత్రమైన పుష్కరిణిలో చేపలను పట్టుకోవడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు.

అసలు పుష్కరిణిలోకి చేపలు ఎలా వచ్చాయి?

గజేంద్ర మోక్ష పుష్కరిణిలోకి చేపలు ఎలా వచ్చాయి? ప్రకృతి సహజసిద్ధమా! ఎవరైనా చేప పిల్లలను కోనేరులో వేశారా అన్నది భక్తులను వేధిస్తున్న ప్రశ్న. గతంలో కొందరు కోనేరులో చేప పిల్లలను పెంపకానికి వేయడంతో అడ్డుకున్నామని అర్చకులు చెబుతున్నారు. అప్పట్లో వేసిన చేపల పెట్టిన గుడ్లే ప్రస్తుతం కోనేరులో చేపలు పెరగడానికి కారణం కావచ్చు అంటున్నారు.

ఘోరం జరిగే వరకూ మనసు కరగదా

ఘోరాలు జరిగితేనే అధికారులు స్పందిస్తారని భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రాణాలు పోయే వరకూ స్పందించారా? అని ప్రశ్నిస్తున్నారు. పుష్కరిణికి మెట్ల మార్గం నాచుకట్టి కనీసం భద్రత లేకపోవడంతో ఇటీవల బొర్రంపాలెంకు చెందిన తండ్రీ కొడుకు స్నానానికి దిగి మృతిచెందారు. దీంతో రెవెన్యూ, దేవదాయశాఖ, అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టేందుకు తగు సూచనలతో ప్రణాళికను సిద్ధం చేశారు.

పుష్కరిణిలో నీటికి మోక్షం

ఎట్టకేలకు పుష్కరిణిలో నీటికి మోక్షం కలిగింది. ఇటీవల జరిగిన ప్రమాదంతో ఇది సాధ్యమైంది. కొన్ని సంవత్సరాలుగా పుష్కరిణిలో నీరు నిల్వ ఉండి నాచుకట్టి తట్టు తేలి పుష్కరిణి (కోనేరు) ప్రమాదకరంగా మారింది. పదవులు లేకపోయినా కొందరు పెత్తనం చెలాయించడం వల్ల ఆలయ అభివృద్ధికి ఆటకం కలుగుతోందని గ్రామస్తులు, భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరుతున్నారు.

పుష్కరిణిలో డెవిల్ ఫిష్

పుష్కరిణిలో సాధారణ చేపలతో పాటు డెవిల్ ఫిష్‌లు పెరిగాయి. పుష్కరిణిలో నీరు తగ్గుముఖం పట్టడంతో చేపల వేటకు దిగిన వారి వలకు ఈ డేవిల్ ఫిష్‌లు చిక్కాయి. అటుగా వెళ్లే వారందూ వాటిని చూసేందుకు ఎగబడి ఫొటోలు తీసుకున్నారు. ఈ డేవిల్ ఫిష్, ఇతర జాతులకు చెందిన చేపలు పుష్కరిణి అడుగు బాగం బురదలో తేలియాడుతున్నాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	24,500
గటగట (వెయ్యి)	22,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	23,500
గటగట (వెయ్యి)	21,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 - 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 - 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750 ఒక కిలో 260


దేవదాయ శాఖ రాజమహేంద్రవరం
ఆర్‌జేసీగా త్రినాథరావు



త్రినాథరావు

అన్నవరం: విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న వి.త్రినాథరావును దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ (రాజమహేంద్రవరం)గా బదిలీ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సింహాచలం దేవస్థానానికి ఈఓని నియమించేవరకు ఆ దేవస్థానానికి ఇన్‌చార్జి ఈఓగా కూడా కొనసాగాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఇన్‌చార్జి ఆర్‌జేసీగా పనిచేస్తున్న ద్వారకాతిరుమల దేవస్థానం ఈఓ వి. సత్యనారాయణమూర్తికి ఇన్‌చార్జి బాధ్యతలు తొలగించారు. త్రినాథరావు గతంలో రాజమహేంద్రవరం ఆర్‌జేసీగా, రెండుసార్లు అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా, 2020-22 మధ్య రెగ్యులర్ ఈఓగా పనిచేశారు. ఆ తరువాత ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ అయ్యారు. సింహాచలం దేవస్థానం ఈఓగా 2024లో బదిలీ అయ్యారు. ఈ ఏడాది జనవరిలో ఆయన సెలవు పై విదేశాలకు వెళ్లగా ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ఆర్‌జేసీ సుబ్బారావును సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా నియమించారు. ఏప్రిల్ 30న సింహాచలం అప్పన్న చందనోత్సవం రోజున గోడ కూలి ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో ఇన్‌చార్జి ఈఓ సుబ్బారావుతో సహా ఆరుగురు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. త్రినాథరావు సెలవు అనంతరం మే 26న సింహాచలం దేవస్థానం ఈఓగా జాయిన్ అయ్యారు.

ఎండ వేడికి పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నిడదవోలు : పట్టణంలోని బసివిరెడ్డిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎండ వేడికి సోమవారం పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ బయటకు రావడంతో అంటుకొని మంటలు ఎగసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న గడ్డి మొక్కలు మంటలకు కాలిపోయాయి. పురుషోత్తపల్లి విద్యుత్ ఏఈ బి.రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని తన సిబ్బందితో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ తీసివేసి ప్రత్యామ్నాయంగా మరో మార్గం ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఓ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.30,000 ఆస్తి నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలియజేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో నిడదవోల పట్టణంలోని బసివిరెడ్డిపేట, నిడదవోలు మండలంలోని సమిస్రగూడెం, అట్లపాడు, తాళ్లపాలెం, శెట్టి పేట గ్రామాల్లో సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఏపీఈఏపీ -25 ఫలితాల్లో ఆదిత్య ప్రతిభ



పి.ఆదిత్య అభిషేక్



జి.లోషిణి



సాయి భవ్యహర్షిణి



దేవి సౌమ్యశ్రీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీసెట్-2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఈ మేరకు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో పి.ఆదిత్య అభిషేక్ 13వ ర్యాంక్, జి.లోషిణి 72, .శుభశ్రీవల్లి అత్రేయ 91, జి.శ్రీరామశశాంక్ 95, వై.వేదిక 96 ర్యాంక్ సాధించారన్నారు. వీటితో పాటు 121, 136, 156, 169, 170, 172, 177, 198 ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగంలో సాయిభవ్యహర్షిణి 31వర్యాంక్, దేవి సౌమ్య శ్రీ 112, పి.శ్రీధర్ 119, సి.వెంకట శివసాయి అచ్యుత 152 ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. వీటితో పాటు 500లోపు 38, వెయ్యిలోపు 62మంది ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్య దర్శి కృష్ణదీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ఐబిటీ ప్రిన్సిపాల్ మొయి నా, కో-ఆర్డినేటర్ లక్ష్మీకుమార్, రాఘవరెడ్డి, గంగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కన్నుల పండువలా శ్రీపుష్పయాగం



చోర సంవాదంలో పాత్రధారుడిని కట్టేసిన దృశ్యం



స్వామి వారి శ్రీపుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

- వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు
- బాల బాలాజీ స్వామి వారి కల్యాణోత్సవాలు సంపూర్ణం

మామిడికుదురు: శ్రీనివాసా గోవిందా, శ్రీవేంకటేశా గోవిందా అంటూ భక్తుల కోలాహలం నడుమ అయిదు రోజుల పర్యంతం కనుల పండుగలా సాగిన అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు సోమవారం శ్రీపుష్పయాగంతో సంపూర్ణమయ్యాయి. పచ్చని పందిళ్లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల కాంతులు, పలు రకాల పుష్పాల సోయగాల నడుమ శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీబాల బాలాజీ స్వామి భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ద్వాదశ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయి. వేద పండితులు భక్తులతో కలిసి 12 పర్యాయాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. 12 రకాల మంగళ వాయిద్యాలు, 12 రకాల ప్రసాదాలతో ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. కల్యాణోత్సవాల్లో చివరి అంకంగా స్వామి వారి శ్రీపుష్పయాగం (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. శ్రీపుష్పయాగంలో పాల్గొన్న దంపతులకు ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామి వారి తరపున తాంబూలాలు అందించారు. పసుపు, కుంకుమ, రవికల గుడ్డ అందజేశారు. ముందుగా సుప్రభాత సేవతో అయిదవ రోజు శ్రీబాల బాలాజీ స్వామి వారిని మేల్కొలిపారు. స్వామి వారి సన్నిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన చోర సంవాదం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం ఉప ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి శిష్యులు చలమచర్ల వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. బాల భోగం, నివేదన, వేదపారాయణ హృద్యంగా సాగాయి. వేద మంత్రోచ్చారణల నడుమ నిత్యహోమం, నిత్యారాధన, మంగళ శాసనం, తీర్థప్రసాద గోష్ఠి, తదితర కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు. దేవస్థానం కార్య నిర్వహణాధికారిణి ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు కనుల పండువలా జరిగాయి.

దివ్యాంగ హక్కుల వేదిక సమావేశం రేపు

రామచంద్రపురం రూరల్: అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో రామచంద్రపురం పట్టణంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు పాల్గొననున్నారని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే విధంగా జిల్లా, మండల స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.